RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
# హైదరాబాద్ ఎస్టేట్
తెలుగు దిన పత్రిక
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
hyderabadestate.co.in
సంపుటి : 13 సంచిక : 298 | శనివారం 11 ఏప్రిల్ 2026 | ఎడిటర్ : బట్టు లక్ష్మీనారాయణ, | పేజీలు :6 వెల : రూ. 5.00
Hyderabad, Vijayawada, Vishakapatnam Tirupathi, Ananthapuram,Guntur,Nellor,Ongole,kadapa, Medak, Sangareddy, Siddipet, Nalagonda, Karimnagar,

“ అన్నా...నన్ను మీతో కలిసి పనిచేయమని

# దేవుడే పంపిండు..”

## అన్నా.. నన్ను దేవుడే పంపిండు మీతో కలిసి పని చేయమని..”

## కేసీఆర్ గారిని కలిసిన సందర్భంగా.. మాజీ మంత్రి జీవన్ రెడ్డి భావోద్వేగం.





హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి గజ్వేల్ :దాచేపల్లి రవి తెలంగాణ రిపోర్టర్స్ ఇంచార్జి

– ఎర్రవెల్లి నివాసానికి చేరుకున్న మాజీ మంత్రి జీవన్ రెడ్డి కి ఘన స్వాగతం పలికిన పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు, పార్టీ ముఖ్య నేతలు

– బిఆర్ఎస్ అధినేత కే.చంద్రశేఖర్ రావు గారితో ఎర్రవెల్లి నివాసంలో,మాజీ మంత్రి టి.జీవన్ రెడ్డి..శుక్రవారం నాడు మర్యాదపూర్వక భేటీ అయ్యారు.

నివాసానికి చురుకున్న జీవన్ రెడ్డికి, పుష్పగుచ్ఛాలందించి బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రులు, కొప్పుల ఈశ్వర్, గంగుల కమలాకర్, ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్సీ ఎల్ రమణ, ఎమ్మెల్యే డా. కె.సంజయ్, మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్, మాజీ ఎమ్మెల్యే కె. విద్యాసాగర్ రావు, పార్టీ నేతలు గ్యాదరి బాలమల్లు, మారెడ్డి శ్రీనివాస్ రెడ్డి,రాగిడి లక్ష్మారెడ్డి తదితరులున్నారు.

జీవన్ రెడ్డి గారితోపాటు వచ్చిన వారిలో, వారి కుమారులు, జగిత్యాల మాజీ జడ్పీ చైర్ పర్సన్ వసంత సురేశ్ దంపతులు తదితరులున్నారు.

# నా.. మాట!

మనిషిలో సంకల్పం,పట్టుదల గొప్పదైనప్పుడు..
ప్రతి మనిషి అనుకున్న లక్ష్యాన్ని ఖచ్చితంగా చేరుకుంటాడు..
తను నడిచే దారిలో,ఎన్ని ముళ్లపోదలు,
బండరాళ్లు ఎదురుపడ్డా,అక్షణం మాత్రమే,
అతని ప్రయాణాన్ని నెమ్మది చేస్తాయి..
ఓడిపోయినా ప్రతిసారి లేచి,మళ్ళీ ప్రయత్నిస్తే,
జీవిత అనుభవం,ఓగుణపాఠం నేర్పుతుంది..
ఆలోచన విధానంలో మార్పు మొదలవుతుంది..
తనలో ఉండే బలమైన నమ్మకమే,
అతన్ని ఉన్నత శిఖరాలకు చేర్చుతుంది..
అనుకున్న లక్ష్యన్ని సాధించాక,
మనిషి ప్రవర్తనలో మార్పు రాకూడదు..
ఓటమి చెందిన వారిని చూసి,నవ్వుకోకూడదు..
ఈర్ష్య,ద్వేషం దారి దాపుల్లోకి కూడ రానివ్వకూడదు..
ఏ విదంగా కష్టపడితే ఫలితం సాధించవచ్చో, ఇతరులకు విడమరచి చెప్పాలి..
సాటి మనుషులకు సాయం చేసే గుణం మెండుగా ఉన్నప్పుడే జనం నోళ్ళల్లో నానుతావు..
ఈ సమాజంలో మంచోడిగా ముద్ర వేసుకుంటావు!

**పెద్దపల్లి రాజన్న...**

Cell:9848174314



## భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవానికి మోదీకి ఆహ్వానం!

తుది దశకు చేరుకున్న భోగాపురం విమానాశ్రయం పనుల

౦-మోదీకి నాలుగు తేదీలను సూచించిన ఏపీ ప్రభుత్వం

2

## అమరావతిని అవినీతికి తరగని గనిలా చంద్రబాబు వాడుకుంటున్నారు

నవ రాయ్‌పూర్‌ను ఉదాహరణగా చూపుతూ అమరావతిపై సజ్జల విమర్శలు

అమరావతిలో సామాన్య ప్రజలు నివసించే పరిస్థితి లేదన్న సజ్జల

ఆకాశహర్మ్యాలు కట్టడం వల్ల రాష్ట్రానికి ఆదాయం ఎలా వస్తుందో చెప్పలేకపోతున్నారని విమర్శ



2

జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ పరిధిలో

# భారీ ఎత్తున అవినీతి జరుగుతోంది

గుంపు మేస్త్రీ అంటూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యంగా కల్వకుంట్ల కవిత ఘాటు విమర్శలు

ప్లానింగ్ డిపార్ట్‌మెంట్‌లో రేవంత్ కనుసన్నల్లోనే పనులు జరుగుతున్నాయని ఆరోపణ

నిధులు దారిమళ్లిస్తున్నారంటూ విమర్శలు



౦హైదరాబాద్ నగరాభివృద్ధి ముసుగులో జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ పరిధిలో భారీ ఎత్తున అవినీతి జరుగుతోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన ఆరోపణలు చేశారు. ఈరోజు మీడియాతో మాట్లాడిన ఆమె, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వంపై విమర్శనాస్త్రాలు సంధించారు. ప్రధానంగా హెచ్ఎండీఏ పరిధిలో సుమారు 35 వేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములను విక్రయానికి పెట్టారని, అయితే ఆ నిధులను నగర అభివృద్ధికి వెచ్చించకుండా దారి మళ్లిస్తున్నారని ఆమె ఆరోపించారు. హెచ్ఎండీఏకు చైర్మన్‌గా, వైస్ చైర్మన్‌గా స్వయంగా ముఖ్యమంత్రే ఉన్నారని గుర్తు చేస్తూ, ప్లానింగ్ డిపార్ట్‌మెంట్‌లో ఆయన అనుచరుల కనుసన్నల్లోనే పనులు జరుగుతున్నాయని ధ్వజమెత్తారు. ముఖ్యంగా టెండర్ల ప్రక్రియలో నిబంధనలను తుంగలో తొక్కారని కవిత ఆరోపించారు. గతంలో నామినేషన్ పద్ధతిలో జరిగిన పనుల కంటే, రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత సుమారు 1,140 కోట్ల రూపాయల కాంట్రాక్టులను అదే పద్ధతిలో అప్పగించారని, ఇది ఆర్థిక శాఖ నిబంధనలకు విరుద్ధమని ఆమె పేర్కొన్నారు. పారదర్శకమైన టెండర్ల ద్వారా ప్రభుత్వానికి వచ్చే ఆదాయానికి గండికొట్టి, కేవలం అవినీతి కోసమే ‘ఫ్యూచర్ సిటీ‘ పేరుతో సరికొత్త నాటకాలకు తెరలేపారని విమర్శించారు. జీహెచ్ఎంసీ పాలన ప్రస్తుతం ‘గుంపు మేస్త్రి‘ చేతుల్లో చిక్కి మహా అవినీతికి నిలయంగా మారిందని ఆమె వ్యాఖ్యానించారు. ఔటర్ రింగ్ రోడ్డు వ్యవహారంలో గతంలో సిట్ వేయించిన ముఖ్యమంత్రి, ఇప్పుడు అదే కాంట్రాక్టును ఎలా కొనసాగిస్తున్నారని ఆమె ప్రశ్నించారు.

టీజీఎస్ఆర్టీసీ ఉద్యోగులకు

# గుడ్ న్యూస్..

. పెరిగిన కరవు భత్యం

తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగులకు 2.1 శాతం డీఏ పెంపు

50.7 శాతం నుంచి 52.8 శాతానికి చేరిన కరవు భత్యం

జనవరి 2026 నుంచి అమల్లోకి రానున్న పెంపు

సంస్థపై నెలకు రూ.2.82 కోట్ల అదనపు ఆర్థిక భారం

38 వేల మందికి పైగా సిబ్బందికి ప్రయోజనం



RNI No Tel / 2012 /4241
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
శనివారం 11
ఏప్రిల్ 2026

## " అన్నా...నన్ను మీతో కలిసి పనిచేయమని

# దేవుడే పంపిండు.."

" అన్నా...నన్ను మీతో కలిసి పనిచేయమని దేవుడే పంపిండు.."

కేసీఆర్ తో భేటీ సందర్భంగా జీవన్ రెడ్డి భావోద్వేగం నిరంతరం తన నియోజకవర్గం, జిల్లా ప్రజలు, రైతుల గురించి ఆలోచన చేసే రైతు నాయకుడు, తెలంగాణ తనానినికి దర్పణంగా నిలిచే మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి., తెలంగాణ సాధకుడు రైతు బాంధవుడు బిఆర్ఎస్ అధినేత కెసీఆర్ గారి కలయిక సందర్భంగా భావోద్వేగ వాతావరణం నెలకొంది. కేసీఆర్ గారిని కలిసిన సందర్భంగా జీవన్ రెడ్డి భావోద్వేగానికి లోనయ్యారు.

"తెలంగాణకు నష్టం జరుగుతున్న సమయంలో మీతో కలిసి పనిచేయాల్సిన అవసరమున్నదని, మీతో కలిసి పనిచేయమని దేవుడే నన్ను మీదగ్గరికి పంపించిండు..అన్నా. చాలా గ్యాప్ తర్వాత ఇన్నాల్లకైనా మీతో కలిసిపనిచేసే అవకాశం రావడం సంతోషంగా వుంది అన్నా.." అంటూ తన మనసు మాటను భావోద్వేగంతో మాజీ మంత్రి జీవన్ రెడ్డి వ్యక్తం చేశారు. కాగా...జీవన్ రెడ్డిగారిని అనునయిస్తూ,వారిని అప్యాయంగా దగ్గరికి తీసుకున్న కేసీఆర్ గారు, వారిని హృదయపూర్వకంగా ఆలింగనం చేసుకొని, దుశ్శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం ఇచ్చి ఆహ్వానించారు. కాసేపు ఇష్టాగోష్టి తర్వాత జీవన్ రెడ్డి బృందాన్ని లంచ్ ఆథిధ్యానికి కేసీఆర్ ఆహ్వానించారు

## అమరావతిని అవినీతికి తరగని గనిలా

# చంద్రబాబు వాడుకుంటున్నారు

ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్మిస్తున్న అమరావతి రాజధాని 40 ఏళ్లయినా పూర్తికాదని, అదొక అసాధ్యమైన ఆలోచన అని వైసీపీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని నవ రాయ్‌పూర్‌ను ఉదాహరణగా చూపుతూ, అక్కడ కేవలం భవనాలు మాత్రమే ఉన్నాయి తప్ప జనం లేరని, అమరావతి పరిస్థితి కూడా అలాగే మారుతుందని ఆయన హెచ్చరించారు.కేవలం ఎమ్మెల్యేలు, మంత్రులు, ఐఏఎస్ అధికారులు, జడ్జిల కోసం విలాసవంతమైన బంగ్లాలు కడుతున్నారే తప్ప, సామాన్య ప్రజలు అక్కడ నివసించే పరిస్థితి లేదని ధ్వజమెత్తారు. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ స్థాయిలో రేట్లు పెట్టి... ఎటువంటి మౌలిక సదుపాయాలు లేని చోటికి ప్రజలు ఎందుకు వస్తారని సజ్జల ప్రశ్నించారు.చంద్రబాబు అమరావతిని ఒక 'గ్రోత్ ఇంజిన్'లా కాకుండా, తన అవినీతికి తరగని గనిలా, అక్షయపాత్రలా వాడుకుంటున్నారని సజ్జల ఆరోపించారు. రాజధాని పేరుతో లక్షల కోట్ల రూపాయల అప్పులు తీసుకురావడం భావితరాలకు అన్యాయం చేయడమేనని మండిపడ్డారు.

## కర్ణాటక హైకోర్టులో రణ్‌వీర్‌కు చుక్కెదురు!

'కాంతార: ఛాప్టర్ 1' సినిమాలోని ఓ పాత్రను అనుకరిస్తూ మతపరమైన మనోభావాలను దెబ్బతీశారన్న ఆరోపణలపై నమోదైన కేసులో బాలీవుడ్ నటుడు రణ్‌వీర్ సింగ్ కీలక అడుగు వేశారు. తాను దాఖలు చేసిన క్షమాపణ అఫిడవిట్‌లోని పదజాలంపై ఫిర్యాదుదారు అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఆయనను సంతృప్తిపరిచేలా కొత్త అఫిడవిట్‌ను రూపొందించేందుకు సిద్ధంగా ఉన్నానని కర్ణాటక హైకోర్టుకు తెలిపారు.గతేడాది గోవాలో జరిగిన 56వ అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (ఐఎఫ్ఎఫ్ఐ)లో ఈ వివాదం చోటుచేసుకుంది. ఆ కార్యక్రమంలో రణ్‌వీర్.. 'కాంతార' సినిమాలో నటుడు రిషబ్ శెట్టి పోషించిన దైవ పూనకం వచ్చిన పాత్రను అనుకరిస్తూ, దైవాన్ని పొరపాటున 'ఆడ దెయ్యం' అని సంబోధించినట్లు ఆరోపణలు వచ్చాయి. దీనిపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవడంతో ఓ న్యాయవాది ఫిర్యాదు మేరకు ఆయనపై ఎఫ్ఐఆర్ నమోదైంది. ఈ ఎఫ్ఐఆర్‌ను రద్దు చేయాలని కోరుతూ రణ్‌వీర్ సింగ్ హైకోర్టును ఆశ్రయించారు.ఇవాళ ఈ పిటిషన్‌పై జస్టిస్ ఎం. నాగప్రసన్న ధర్మాసనం ఎదుట విచారణ జరిగింది. రణ్‌వీర్ తరపున సీనియర్ న్యాయవాది సజన్ పూవయ్య వాదనలు వినిపిస్తూ, ఇప్పటికే కోర్టులో క్షమాపణ కోరుతూ అఫిడవిట్ దాఖలు చేశామని, సంబంధిత ఆలయాన్ని సందర్శించి ప్రార్థనలు చేస్తానని కూడా అందులో పేర్కొన్నామని తెలిపారు. అయితే, ఫిర్యాదుదారు తరపు న్యాయవాది దీనిపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆ అఫిడవిట్‌లో నిజమైన పశ్చాత్తాపం కనిపించడం లేదని, అందులోని ఉద్దేశం స్పష్టంగా లేదని వాదించారు. మరింత నిర్దిష్టమైన, స్పష్టమైన క్షమాపణ కోరారు.దీనిపై స్పందించిన పూవయ్య, తన చర్యలు భక్తుల మనోభావాలను దెబ్బతీస్తాయని తనకు తెలియదని, జరిగిన సంఘటనకు చింతిస్తున్నట్లు రణ్‌వీర్ అఫిడవిట్‌లో పేర్కొన్నారని గుర్తుచేశారు. వివాదం జరిగిన వెంటనే బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పారని కూడా వివరించారు. అయినప్పటికీ ఫిర్యాదుదారు పక్షం సంతృప్తి చెందకపోవడంతో వారిని సంప్రదించి, వారి ఆందోళనలను పరిష్కరించేలా కొత్త అఫిడవిట్‌ను రూపొందిస్తామని పూవయ్య కోర్టుకు తెలియజేశారు.ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం, ఫిర్యాదుదారుకు సంతృప్తి కలిగించేలా సవరించిన అఫిడవిట్‌ను దాఖలు చేయాలని ఆదేశిస్తూ, తదుపరి విచారణను ఏప్రిల్ 23కు వాయిదా వేసింది. గతంలో ఈ కేసులో రణ్‌వీర్‌పై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని కోర్టు స్టే ఇచ్చినప్పటికీ, ప్రజా జీవితంలో ఉన్న వ్యక్తిగా మాటలు, చేతల్లో జాగ్రత్తగా ఉండాలని, ఏ మత మనోభావాలను దెబ్బతీయవద్దని హెచ్చరించిన విషయం తెలిసిందే.

## ఢిల్లీ రాజకీయాల్లోకి నితీశ్ కుమార్..

రాష్ట్ర శాసనసభ, శాసనమండలి, లోక్‌సభ, రాజ్యసభ.. ఇలా నాలుగు చట్టసభల్లోనూ సభ్యుడిగా పనిచేసిన కొద్దిమంది నేతల జాబితాలో ఆయన చేరారు.రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణస్వీకార కార్యక్రమం కోసం ఆయన గురువారమే ఢిల్లీకి చేరుకున్నారు. మార్చి 16న రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికైన నితీశ్, మార్చి 30న తన శాసనమండలి సభ్యత్వానికి (ఎమ్మెల్సీ) రాజీనామా చేశారు. రాజ్యాంగ నిబంధనల ప్రకారం ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయడంతో ఆయన ముఖ్యమంత్రి పదవి నుంచి కూడా తప్పుకోవాల్సి ఉంటుంది.ఈ సందర్భంగా ఢిల్లీలో నితీశ్ కుమార్ మాట్లాడుతూ.. "బీహార్‌లో చాలా పనులు చేశాను. ఇక ఇక్కడే (ఢిల్లీ) ఉండి సేవ చేయాలని భావిస్తున్నాను. మూడు నాలుగు రోజుల్లో సీఎం పదవికి రాజీనామా చేస్తాను. కొత్త ముఖ్యమంత్రి, మంత్రులు బాధ్యతలు చేపడతారు" అని స్పష్టం చేశారు.2005 నవంబర్‌లో ముఖ్యమంత్రి అయినప్పటి నుంచి నితీశ్ కుమార్ అసెంబ్లీకి పోటీ చేయకుండా, శాసనమండలి సభ్యుడిగానే కొనసాగుతున్నారు. 2006 నుంచి వరుసగా నాలుగుసార్లు ఆయన ఎమ్మెల్సీగా పనిచేశారు. 1985లో తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన నితీశ్, ఆ తర్వాత లోక్‌సభ ఎంపీగా కూడా సేవలందించారు. తాజా పరిణామంతో బీహార్ రాజకీయాల్లో కొత్త సమీకరణాలు మొదలుకానున్నాయి

## భోగాపురం విమానాశ్రయం

## ప్రారంభోత్సవానికి మోదీకి ఆహ్వానం!

ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కల, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు అయిన భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం (అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం) ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారవుతోంది. ఈ మెగా ప్రాజెక్టును జాతికి అంకితం చేయాల్సిందిగా కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రధానమంత్రి మోదీకి అధికారికంగా ఆహ్వానం పంపారు. ప్రధాని షెడ్యూల్ లభ్యతను బట్టి జూలై 5 లేదా 8వ తేదీల్లో ఒక రోజును, లేనిపక్షంలో ఆగస్టు 17 లేదా 19 తేదీల్లో మరొక తేదీని ప్రారంభోత్సవానికి కేటాయించాలని ఏపీ ప్రభుత్వం విజ్ఞప్తి చేసినట్లు సమాచారం.ప్రస్తుతం ఈ విమానాశ్రయ పనులు తుది దశకు చేరుకున్నాయి. సుమారు 98 శాతం పనులు ఇప్పటికే పూర్తవ్వగా, మిగిలిన ఫినిషింగ్ పనులను జూన్ 30వ తేదీ నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం అదనపు సిబ్బందిని మోహరించి రాత్రింబవళ్లు యుద్ధ ప్రాతిపదికన పనులు కొనసాగిస్తున్నారు. ఈ అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి వస్తే ఉత్తరాంధ్ర రూపురేఖలు మారిపోవడమే కాకుండా... పర్యాటక, పారిశ్రామిక రంగాలు కొత్త పుంతలు తొక్కుతాయని నిపుణులు భావిస్తున్నారు. ఇప్పటికే ఈ విమానాశ్రయాన్ని కస్టమ్స్ ఎయిర్‌పోర్ట్‌గా కేంద్రం నోటిఫై చేయగా, అంతర్జాతీయ విమానాల రాకపోకలకు అవసరమైన ఇమ్మిగ్రేషన్ హోదాను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని ఏపీ ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది

# రాష్ట్రంలో గ్యాస్ సరఫరాపై

# సీఎం చంద్రబాబు సమీక్ష

ఈ సమీక్షలో భాగంగా 'దీపం' పథకం లబ్ధిదారులను పీఎన్జీ వైపు ప్రోత్సహించడంపై సీఎం ప్రత్యేకంగా దృష్టి సారించారు. దీపం లబ్ధిదారులు పీఎన్జీ కనెక్షన్‌కు మారితే, వారికి పథకం కింద అందే రాయితీ సొమ్మును యథావిధిగా వారి ఖాతాల్లో జమ చేయాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయం తీసుకుందని గుర్తుచేశారు. ఈ విషయంపై లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని, సంబంధిత ఉత్తర్వులను తక్షణమే జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. పీఎన్జీ వాడకం సురక్షితమని, చౌక అని ప్రజలకు వివరించాలన్నారు.

**కేంద్రమంత్రికి ఫోన్**

ప్రస్తుతం గృహ అవసరాలకు గ్యాస్ సరఫరాలో ఇబ్బందులను అధిగమించామని, త్వరలోనే పరిస్థితి సాధారణ స్థితికి వస్తుందని అధికారులు సీఎంకు వివరించారు. ఇదే సమయంలో శ్రీకాకుళం-కాకినాడ నేచురల్ గ్యాస్ పైప్‌లైన్ పనుల్లో జాప్యంపై ముఖ్యమంత్రి ఆరా తీశారు.

కేంద్రం నుంచి కొన్ని అనుమతులు రావాల్సి ఉందని అధికారులు చెప్పడంతో, సమీక్ష సమావేశం నుంచే కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరీకి చంద్రబాబు ఫోన్ చేశారు. టెండర్ల ప్రక్రియ పూర్తయినందున, పనులను వేగంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించి, త్వరలోనే సమీక్షించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## ట్రెండ్‌ను ఫాలో కావొద్దు...

## సవాళ్లను స్వీకరించండి:




యువత సవాళ్లను స్వీకరించి ముందుకు సాగాలని, ట్రెండ్‌ను అనుసరించకుండా నిర్దిష్ట లక్ష్యంపై దృష్టి సారించాలని ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. బెంగళూరులోని సర్జాపూర్‌లో ఉన్న గ్రీన్‌వుడ్ హై ఇంటర్నేషనల్ స్కూల్ ఐబీడీపీ (గ్రేడ్-12) 2026 గ్రాడ్యుయేషన్ డే వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి స్ఫూర్తిదాయక ప్రసంగం చేశారు.షార్ట్‌కట్‌లతో నిండిన ప్రస్తుత ప్రపంచంలో నైతికతే గొప్ప బలమని లోకేశ్ అన్నారు. "కేవలం ఏం నేర్చుకున్నారన్నది కాకుండా, ఎలా ఆలోచిస్తున్నారనేదే అత్యంత ముఖ్యం. ఎవరూ చూడనప్పుడు మనం ఎలా ప్రవర్తిస్తామో అదే మన నిజమైన వ్యక్తిత్వాన్ని తెలియజేస్తుంది" అని విద్యార్థులకు హితవు పలికారు. లక్ష్య సాధనలో పట్టుదలతో ఉండాలని, ఎదురయ్యే అడ్డంకులను అవకాశాలుగా మార్చుకోవాలని సూచించారు.ఈ పర్యటన సందర్భంగా మంత్రి లోకేశ్ కీలక ప్రకటన చేశారు. ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ సత్వా గ్రూప్ ఆధ్వర్యంలో ఈ పాఠశాల నడుస్తోందని, త్వరలోనే ఈ సంస్థ ఆంధ్రప్రదేశ్, ముఖ్యంగా విశాఖపట్నం అభివృద్ధిలో భాగస్వామ్యం కాబోతోందని వెల్లడించారు. గ్రీన్‌వుడ్ హై స్కూల్ అంతర్జాతీయ స్థాయిలో పౌరులను (గ్లోబల్ సిటిజన్స్) తయారు చేస్తుండటం గర్వకారణమని ఆయన ప్రశంసించారు.అంతకుముందు, పాఠశాల ప్రాంగణానికి చేరుకున్న మంత్రి లోకేశ్ కు నిర్వాహకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్కూల్‌లోని స్పోర్ట్స్ కాంప్లెక్స్, ఆర్ట్ గ్యాలరీ, తరగతి గదులను సందర్శించారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన లోకేశ్, గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేసి అభినందనలు తెలిపారు. విద్యార్థుల గౌరవ వందనం స్వీకరించి, వారితో కలిసి గ్రూప్ ఫోటో దిగారు

## టీజీఎస్ఆర్టీసీ ఉద్యోగులకు

# గుడ్ న్యూస్...

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఉద్యోగుల కరవు భత్యం (డీఏ) 2.1 శాతం పెంచుతూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ విషయాన్ని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారికంగా ప్రకటించారు. తాజా పెంపుతో ఆర్టీసీ ఉద్యోగుల డీఏ 50.7 శాతం నుంచి 52.8 శాతానికి చేరింది. ఈ నిర్ణయంతో సుమారు 38 వేల మందికి పైగా ఆర్టీసీ సిబ్బందికి లబ్ధి చేకూరనుంది.డీఏ పెంపు నిర్ణయం 2026 జనవరి నుంచే అమల్లోకి వస్తుందని మంత్రి పొన్నం స్పష్టం చేశారు. జనవరి నుంచి మార్చి వరకు మూడు నెలల బకాయిలను రాబోయే నెలల్లో సప్లిమెంటరీ బిల్లుల ద్వారా విడతలవారీగా చెల్లించనున్నట్లు తెలిపారు. ఈ డీఏ పెంపు వల్ల ఆర్టీసీపై ప్రతి నెలా అదనంగా రూ.2.82 కోట్ల ఆర్థిక భారం పడనుంది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమానికి పూర్తిగా కట్టుబడి ఉందని, ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని పునరుద్ఘాటించారు.సాధారణంగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉద్యోగులకు ఏటా జనవరి, జులై నెలల్లో డీఏను సవరిస్తారు. గత ఏడాది జులైలో కూడా ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వం 2.1 శాతం డీఏ పెంచింది. తాజాగా మరోసారి డీఏను పెంచుతూ నిర్ణయం తీసుకోవడం పట్ల ఉద్యోగ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న 'మహాలక్ష్మి' పథకం ఆర్టీసీకి ఆర్థికంగా ఊతమిస్తోంది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగి, సంస్థ ఆదాయం వృద్ధి చెందింది. గత ఆర్థిక సంవత్సరంలో ఫిబ్రవరి నాటికి ఆర్టీసీ సుమారు రూ.954 కోట్ల నిర్వహణ లాభాన్ని ఆర్జించింది. మహాలక్ష్మి పథకానికి సంబంధించిన రీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని ప్రభుత్వం ఎప్పటికప్పుడు ఆర్టీసీకి చెల్లిస్తుండటంతో సంస్థ కార్యకలాపాలు సజావుగా సాగుతున్నాయి. ఇదే సమయంలో కొత్త బస్సులను కొనుగోలు చేసి, ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడం ద్వారా లాభాలను మరింత పెంచుకోవాలని ఆర్టీసీ యాజమాన్యం ప్రణాళికలు రచిస్తోంది.

# మంత్రులకు చంద్రబాబు

# సీరియస్ వార్నింగ్..

ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గ సమావేశం పలు కీలక నిర్ణయాలతో ముగిసింది. సుమారు మూడు గంటల పాటు సుదీర్ఘంగా సాగిన ఈ భేటీలో రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన అంశాలతో పాటు, కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోదీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ తీర్మానాలు చేశారు.అయితే, అజెండా అంశాలపై చర్చ ముగిసిన తర్వాత మంత్రులతో ప్రత్యేకంగా సమావేశమైన ముఖ్యమంత్రి, ప్రభుత్వ సమాచారం లీక్ అవుతున్న తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేబినెట్ అజెండా, ఇతర రహస్య వివరాలు సమావేశానికి ముందే బయటకు రావడంపై మంత్రులను నిలదీశారు. గతంలో ఇలాంటి లీకుల కారణంగానే ఎన్టీఆర్ తన కేబినెట్‌ను రద్దు చేయాల్సి వచ్చిన విషయాన్ని గుర్తు చేస్తూ, భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతమైతే సంబంధిత మంత్రులనే బాధ్యులను చేస్తూ కఠిన చర్యలు తీసుకుంటానని స్పష్టమైన హెచ్చరిక జారీ చేశారు.ప్రభుత్వ పథకాల అమలు తీరుపై కూడా ముఖ్యమంత్రి మంత్రులకు దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా 'జలధార' పథకం ప్రయోజనాలు ప్రజల్లోకి బలంగా వెళ్లేలా అవగాహన కల్పించాలని సూచించారు. భూములకు సంబంధించిన పాస్‌బుక్స్ పంపిణీ వ్యవహారంపై రెవెన్యూ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని... మంత్రులు, అధికారులు నెలకు కనీసం నాలుగు సార్లు జిల్లాల్లో పర్యటించి క్షేత్రస్థాయి పరిస్థితులను పర్యవేక్షించాలని ఆదేశించారు. అలాగే కేంద్ర ప్రభుత్వ 'సూర్య ఘర్' పథకం లక్ష్యాలను వచ్చే ఏడాది నాటికి పూర్తి చేసేలా ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రులకు స్పష్టం చేశారు. పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్న మహిళా బిల్లు అంశంపై కూడా కేబినెట్‌లో ప్రాథమిక చర్చ జరిగింది.రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణపై కూడా ప్రభుత్వం కసరత్తు మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. రాబోయే మూడు నుంచి నాలుగు నెలల వ్యవధిలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే అవకాశాలపై కేబినెట్ సుదీర్ఘంగా చర్చించింది. పరిపాలనలో పారదర్శకత పెంచాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ పథకాల అమలులో వేగం పెంచాలని ముఖ్యమంత్రి మంత్రులకు నిర్దేశించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్న కార్యక్రమాల వివరాలు గోప్యంగా ఉంచాలని, క్రమశిక్షణారాహిత్యాన్ని సహించేది లేదని చంద్రబాబు తేల్చిచెప్పారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
శనివారం 11
ఏప్రిల్ 2026

# మానసిక ఒత్తిడికి యోగా సమర్ధ పరిష్కారం,

## -రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

## -యోగా ద్వారా ఆరోగ్యానికి నూతన దిశ, హెల్త్ వీక్‌లో యోగా దినోత్సవం ఘనంగా నిర్వహణ

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఏప్రిల్ 10:- యోగా సాధన ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఒత్తిడిని సమర్ధవంతంగా అధిగమించవచ్చని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న హెల్త్ వీక్ సందర్భంగా గచ్చిబౌలి స్టేడియంలో యోగా దినోత్సవం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, రహదారులు మరియు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథులుగా హాజరై యోగా ప్రాముఖ్యతను వివరించారు. ప్రజలు నిత్యజీవితంలో యోగాను అలవాటు చేసుకోవాలని సూచించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వేగవంతమైన జీవనశైలిలో పెరుగుతున్న ఒత్తిడి, అనారోగ్య సమస్యలకు యోగా సమగ్ర పరిష్కారమని తెలిపారు. యోగా సాధన ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని, రోజువారీ జీవితంలో యోగాను అలవాటు చేసుకోవడం వల్ల జీవనశైలి సంబంధిత



వ్యాధులను నివారించవచ్చని పేర్కొన్నారు. యోగా కేవలం వ్యాయామ విధానం మాత్రమే కాకుండా ఆరోగ్యకరమైన జీవన విధానమని, దీన్ని ప్రతిరోజూ ఆచరించడం ద్వారా శరీరానికి దృఢత్వం, మనసుకు ప్రశాంతత లభిస్తాయని వివరించారు. అలాగే యోగా ద్వారా రోగనిరోధక శక్తి పెరుగుతుందని, జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని తెలిపారు. మానసిక ప్రశాంతత వ్యక్తిగత స్థాయిలోనే కాకుండా కుటుంబం, సమాజంపై కూడా సానుకూల ప్రభావం చూపుతుందని అన్నారు. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. జిల్లాలో యోగా పట్ల అవగాహన



పెంపొందించేందుకు మరిన్ని కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. చిన్న వయస్సు నుంచే విద్యార్థులకు యోగా అలవాటు చేయడం అవసరమని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. అదే విధంగా ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా హస్తినాపురంలోని మేజర్ పద్మపాణి ఆచార్య మెడిటేషన్ హాల్‌లో కూడా యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ వనస్థలిపురం సూపరింటెండెంట్ నాగేందర్, ప్రోగ్రామ్ ఆఫీసర్ రాధిక, వైద్యులు రాకేష్, గీత, నర్సింగ్ విద్యార్థులు, వైద్య సిబ్బంది, యోగా నిపుణులు పాల్గొన్నారు.

# ప్రజారోగ్యంపై దృష్టి: దోమల నిర్మూలన కోసం ఎల్బీనగర్‌లో ప్రత్యేక చర్యలు

## ఫాగింగ్ యంత్రాలను ప్రారంభించిన స్థానిక ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి.

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఏప్రిల్ 10:- ఎల్బీనగర్ మున్సిపల్ కార్యాలయంలో ఆధునిక ఫాగింగ్ యంత్రాలను స్థానిక ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇటీవల కాలంలో నియోజకవర్గ ప్రజలు దోమల సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలనే ఉద్దేశంతో "దోమల నిర్మూలన యత్నం" పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టినట్లు చెప్పారు.

ఈ కార్యక్రమంలో భాగంగా తన పిలుపునకు స్పందించిన అనుచరులు స్వచ్ఛందంగా తమ సొంత నిధులతో ఫాగింగ్ యంత్రాలను కొనుగోలు చేసి, వివిధ కాలనీల్లో సాయంత్ర వేళల్లో దోమల నివారణ చర్యలు చేపడుతున్నారని వివరించారు. ఈ చర్యల వల్ల ఇప్పటికే కొంత ఉపశమనం లభిస్తున్నట్లు స్థానికులు అభిప్రాయపడుతున్నారని తెలిపారు. గత ప్రభుత్వ కాలంలో ప్రజా సమస్యలను ముందుగానే గుర్తించి కొన్ని వినూత్న కార్యక్రమాలు అమలు చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ముఖ్యంగా




చెరువుల్లో దోమల పెరుగుదలను అరికట్టేందుకు ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ డ్రోన్ల ద్వారా మందుల పిచికారీ చేయడం, అలాగే లార్వాను తినే గంబూజియా చేపలను నీటి వనరుల్లో విడిచిపెట్టడం వంటి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ విధానాలు మంచి ఫలితాలను ఇచ్చాయని పేర్కొన్నారు.

అయితే ప్రస్తుత పరిస్థితుల్లో చెరువుల్లో మొక్కజొన్నలా పెరుగుతున్న నీటి మొక్కలను తొలగించడంలో నిర్లక్ష్యం కనబడుతోందని ఆయన విమర్శించారు. దోమల కారణంగా మలేరియా, డెంగీ వంటి వ్యాధులు వ్యాపించే ప్రమాదం పెరుగుతోందని, ప్రజలు ఉదయం, సాయంత్రం బయటకు రావడానికే




భయపడుతున్నారని చెప్పారు.

ఇటీవలి కాలంలో నిర్వహించిన నిరసన కార్యక్రమాల ఫలితంగా ప్రభుత్వ యంత్రాంగం స్పందించి ప్రతి డివిజన్‌కు కనీసం ఒక ఫాగింగ్ యంత్రాన్ని కేటాయించిందని ఆయన తెలిపారు. ఈ మార్పు తన పోరాట ఫలితమని స్థానిక ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, డిప్యూటీ కమిషనర్లు, ఆరోగ్య విభాగ సిబ్బంది సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# కుంట మరియు బాతుల చెరువుల అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా అధికారులు చర్యలు

రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్‌లోని ఉన్న కుమ్మరి కుంట మరియు బాతుల చెరువుల అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా అధికారులు చర్యలు చేపట్టారు. ఎల్బీనగర్ ఇన్‌చార్జి శ్రీ మధు యాదవ్ ఆదేశాల మేరకు రాష్ట్ర కార్యదర్శి గజ్జి భాస్కర్ యాదవ్ ఆధ్వర్యంలో హయత్‌నగర్ జోన్ కమిషనర్ హేమంత్ పాటిల్ మరియు మురియూ ఇరిగేషన్ విభాగం కార్యనిర్వాహక ఇంజనీరు రామకృష్ణ కలిసి కుమ్మరి కుంట కట్టపై రోడ్డు నిర్మాణం మరియు బాతుల చెరువు సుందరీకరణ పనులను పరిశీలించారు. ఇరిగేషన్ విభాగం కార్యనిర్వాహక ఇంజనీరు రామకృష్ణ మాట్లాడుతూ, కుమ్మరి కుంట కట్టపై రోడ్డు నిర్మాణం మరియు బాతుల చెరువు సుందరీకరణ కోసం జోన్ కమిషనర్ సామూహికంగా స్పందించి ఇరిగేషన్ విభాగం వారు నో అభ్యంతర లేఖ ఇచ్చిన వెంటనే కుమ్మరి కుంట పై రోడ్డు నిర్మాణ పనులు చేపడతామని తెలిపారు. అలాగే బాతుల చెరువు వాకింగ్ ట్రాక్ మరియు ఇతర అభివృద్ధి పనులు కూడా త్వరలో ప్రారంభమవుతాయని ఆయన తెలిపారు.

ఈ కార్యక్రమంలో హయత్‌నగర్ మండల రెవెన్యూ అధికారి, హయత్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కలెక్టర్, సూపరింటెండింగ్ ఇంజనీరు, కార్యనిర్వాహక ఇంజనీరు, రెవెన్యూ ఇన్స్పెక్టర్, సర్వేయర్, టౌన్ ప్లానింగ్ అధికారులు మరియు ఇతరులు పాల్గొన్నారు.



# హిందువుల ఆరాధ్యదైవం గోమాత

## తెలంగాణ లౌఫర్ కౌ ఫౌండేషన్ చైర్మన్ జస్మత్ పటేల్

హైదరాబాద్, ఏప్రిల్ 10: హిందువుల ఆరాధ్య దైవం గోమాతను జాతీయ ప్రాణిగా ప్రకటించి సంరక్షించాలని తెలంగాణ గో సంరక్షణ, అధ్యాత్మిక, సేవా సంస్థలు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. శుక్రవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో తెలంగాణ లౌఫర్ కౌ ఫౌండేషన్ చైర్మన్ జస్మత్ పటేల్, ట్రస్టీ, తరుణ్ మెహతా, చైతన్య మహా ప్రభు, మహా భారత్ ఫౌండేషన్ ప్రధానకార్యదర్శి ఏబీ చైతన్యదాస్, గీతాష్ జీ, శ్రీనివాస్ రావు, మనీషా మెహతా, గోపినాథ్, డాక్టర్ రోహిత్ కాలే, వినయ్ కృష్ణదాస్, కృష్ణ మురళి, దేవదాసి తదితరులు మాట్లాడారు. భారతీయులు గోమాతను విశిష్ట దేవతగా కొలుస్తారన్నారు. గోమాతలో అనేకమైన శక్తులు ఉన్నాయన్నారు. గో సంరక్షణ, భగవద్గీత, సనాతన ధర్మం వ్యాప్తి, ఆధ్యాత్మిక జాగృతి కోసం త్వరలో గచిబౌలి స్టేడియంలో ఛారిటీ క్రికెట్ మ్యాచ్, సంగీత కచేరీని నిర్వహించనున్నట్లు వారు ప్రకటించారు. సనాతన ధర్మం, విలువలతో స్వర్ణ భారత్ను స్థాపించి ప్రపంచ శాంతిని పరిరక్షించడమే లక్ష్యంగా పనిచేస్తామని వారు తెలిపారు.



# బాలల పరిరక్షణ ఆధీనంలో గుర్తుతెలియని పాప.

నర్సరావు పేట కాకతీయ ఏప్రిల్ 10.
కోటప్పకొండ ప్రాంతంలో సుమారు 3 సంవత్సరాల వయస్సు గల ఒక ఆడపాపను తోడు-నీడ వృద్ధాశ్రమం ప్రక్కన గమనించడమైనది. ఆ పాప ఎవరో తెలియకపోవడంతో పాటు, మాట్లాడలేని స్థితిలో ఉన్నది. తోడు-నీడ వృద్ధాశ్రమ నిర్వాహకులు అనురాధ రెడ్డి ఈ విషయాన్ని జిల్లా బాలల పరిరక్షణ విభాగానికి చరవాణి ద్వారా తెలియజేయగా, అనంతరం ఆ పాపను నరసరావుపేట రూరల్ పోలీస్ స్టేషన్లో అప్పగించబడినది. జిల్లా బాలల పరిరక్షణ విభాగం, నరసరావుపేట అధికారులు ఆ పాపను తీసుకొని నరసరావుపేట ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించడం జరిగింది. అనంతరం బాలల సంక్షేమ సమితి గుంటూరు ముందు వర్చువల్ విదానంలో హాజరు పరచగా, వారు ఆ పాపను నరసరావుపేట శిశు గృహంలో ఉండాలని ఆదేశించారు. ఈ పాపకు సంబంధించిన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు లేదా బంధువులు ఎవరైనా ఉన్నచో. తగిన ఆధారాలతో ప్రచురితమైన నాటి నుండి నెల రోజుల లోపు జిల్లా బాలల పరిరక్షణ అధికారి డి.శౌరి రాజు ని చరవాణి నంబర్: 8919164537 సంప్రదించవలని కోరారు.





# పోషణ్ పక్వాడ్ కార్యక్రమాలను ఉపయోగించుకోండి - : సూపర్వైజర్ ధరణి



లిహైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ :ప్రతినిధి హుజుర్నగర్

సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం పొనుగోడు గ్రామములో
: ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే సేవా పక్వాడ్ కార్యక్రమాలను ఉపయోగించుకోవాలని సూపర్వైజర్ ధరణి పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని పొనుగోడు గ్రామంలో అంగన్వాడి కేంద్రం - 06 లో సేవా పక్వాడ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన కుటుంబంలో నిత్యం వాడుకునే నిత్యావసర పోషక ఆహారాలు ఆకుకూరలను పండించే పద్ధతులను వివరించారు. రేషన్ ద్వారా అందించే పోర్టీ ఫైడ్ రైస్ లో ఐరన్, క్యాల్షియం సమృద్ధిగా ఉంటాయని వీటి వలన గర్భిణీ - బాలింతలు, పిల్లలకు పోషకాలు సమృద్ధిగా లభిస్తాయన్నారు. కందిపప్పులో మాంసకృత్తులు అధికంగా ఉంటాయని, రాగులు, నువ్వులు, వట్టి చేపలు, ఆకుకూరల్లో మినరల్స్ ఉంటాయని, నిమ్మ, బత్తాయి, మామిడి, టమాటా, క్యాప్సికం మొదలగు వాటిలో విటమిన్లు పుష్కలంగా లభిస్తాయని, జీడిపప్పు, బాదంపప్పు, పిస్తా లాంటి వాటిలో క్రోవ్వు పదార్థములు ఉంటాయన్నారు. అనంతరం ఏఎన్ఎం కందిమల్ల సునీత మాట్లాడుతూ వడదెబ్బకు గురైన పిల్లలు పెద్దలకు ఓఆర్ఎస్ ను తక్షణమే అందించాలన్నారు. తెల్లగా ఉండే తిను పదార్థాలు బియ్యం, చక్కెర, జొన్నలు, ఆలుగడ్డలు వీటిల్లో కార్బోహైడ్రేట్లు అధికంగా ఉంటాయని వీటిని వీలైనంత తక్కువగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ పోకల నాగమణి, ఆయా మెడిసినమెట్ల ధనమ్మ, ఆశా కార్యకర్త నందిపాటి నీలవేణి, మహిళలు, పిల్లలు, గర్భిణీ- బాలింతలు తదితరులు పాల్గొన్నారు

# కోట్ల విలువైన ప్రభుత్వ భూములపై కన్నేసిన ఆక్రమదారులు.

## చర్యల కోసం కలెక్టర్‌ను ఆశ్రయించిన టీఆర్ఎస్ నేతలు

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఏప్రిల్ 10:- రంగారెడ్డి జిల్లా నాదర్గుల్ పరిధిలో ఉన్న భారీ స్థాయిలో ప్రభుత్వ భూములపై ఆక్రమణల ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. సుమారు 373 ఎకరాల విలువైన ప్రభుత్వ భూమిని రక్షించాలంటూ టీఆర్ఎస్ నాయకులు జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన




ఈ సమావేశంలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, స్థానిక ఎమ్మెల్యేలు మరియు పార్టీకి చెందిన పలువురు కీలక నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నాదర్గుల్ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 673లో ఉన్న ఈ భూమిని కొందరు ప్రభావశీల వ్యక్తులు అక్రమంగా స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.

ప్రత్యేకంగా, ఒక మంత్రి మద్దతుతో కొందరు వ్యక్తులు బలవంతంగా భూములను ఆక్రమిస్తూ, సుమారు 600 మంది రైతులకు ఇబ్బందులు కలిగిస్తున్నారని పేర్కొన్నారు. భూమి చుట్టూ రేకులతో కంచెలు వేసి, రైతుల సాగుకు అడ్డంకులు సృష్టిస్తున్నారని, తీవ్రంగా విమర్శించారు. ల్యాండ్ సీలింగ్ చట్టాన్ని ఉల్లంఘిస్తూ ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలిగించే చర్యలు జరుగుతున్నాయని, ఇందులో భాగంగా కొందరు కాంగ్రెస్ నాయకుల పాత్రపై కూడా అనుమానాలు వ్యక్తం చేశారు. స్థానిక అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ తగిన స్పందన లభించలేదని వారు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూములను కాపాడేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని టీఆర్ఎస్ నేతలు జిల్లా పరిపాలనను డిమాండ్ చేశారు.

# సాఫ్ట్ వేర్ కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

హైదరాబాద్, ఏప్రిల్ 10: కేంద్ర ప్రభుత్వ ఆమోదిత నేషనల్ స్కిల్ అకాడమీ ఆధ్వర్యంలో వివిధ కంప్యూటర్ సాఫ్ట్వేర్ కోర్సుల్లో ఆన్లైన్ శిక్షణకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రోగ్రాం కో ఆర్డినేటర్ వెంకట్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ విద్యార్హత గల అభ్యర్థులు ఆన్లైన్లో ఈ నెల 25వ తేదీ లోగా దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. కంప్యూటర్ సాఫ్ట్వేర్ రంగంలో రాణించేందుకు అవసరమైన ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, మిషన్ లార్నింగ్ బిజినెస్ అనలిటిక్స్, దేవోప్స్, ఫుల్ స్టాక్ డెవలప్మెంట్, పైథాన్, డేటా సైన్స్ బిగ్ డేటా, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, ఎథికల్ హాకింగ్, ప్రాజెక్ట్ మేనేజ్మెంట్, బ్లాక్ చైన్ వంటి 100కి పైగా కంప్యూటర్ సర్టిఫికేషన్ కోర్సుల్లో ఆన్లైన్ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ అనంతరం పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్లు ప్రధానం చేస్తారు. కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులకు దేశ విదేశాలలో ఉత్తమ ఉపాధి, ఉద్యోగ అవకాశాలున్నట్లు తెలిపారు. వివరాలకు ఆన్లైన్: www.nationalskillacademy.in వెబ్సైట్ ద్వారా లేదా సెల్ నంబర్: 9505800050 లో సంప్రదించాలని సూచించారు.



# పల్లవోలులో పోషణ్ పక్వాడ కార్యక్రమం

### పిల్లలను మొబైల్స్ కి మరియు ఫాస్ట్ ఫుడ్ కి దూరంగా ఉంచాలి

### చిన్న పిల్లలకు నాణ్యమైన పోషకాహారం అందించడమే లక్ష్యం - ఐసిడిఎస్ సూపర్వైజర్ సుబ్బరత్నమ్మ



**దువ్వూరు/చాపాడు ఏప్రిల్ 10** హైదరాబాద్ ఎస్టేట్
మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోషణ పక్వాడ కార్యక్రమాలు చాపాడు మండల పరిధిలోని పల్లవోలు గ్రామంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ సుబ్బరత్నమ్మ ఆధ్వర్యంలో పోషన్ పక్వాడ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నపిల్లలకు మొబైల్ దూరంగా ఉంచాలన్నారు. ఫాస్ట్ ఫుడ్ సెంటర్ల నుండి ఆహారం తెచ్చి పిల్లలకు ఇవ్వరాదని, ఇంట్లో సహజంగా చేసిన ఆహారాన్ని మాత్రమే ఇవాళ అన్నారు. చిప్స్, కురుకురే వంటి జంక్ ఫుడ్స్ కు బదులుగా శనగలు, పప్పులు, పల్లీలు, చిరుధాన్యాలతో తయారైన పాప్ కార్న్, పండ్లు ఆరోగ్యకరమైన స్నాక్స్ ను వినియోగించాలని సూచించారు.హానికర అలవాట్లు మార్చుకోవాలని ఆమె సూచించారు. చక్కెరకు దూరంగా ఉంచాలని జ్ఞాపక శక్తి ఆలోచన వికాసం చిన్నపిల్లలకు దెబ్బతింటుంది. చిన్నపిల్లలకు మొబైల్ ఇవ్వడం ద్వారా కంటి చూపు, మెదడు అభివృద్ధిపై చెడు ప్రభావం చూపుతుంది. ఆరోగ్యకరమైన ఎదుగుదలకు పోషకాహారం ఇవ్వాలన్నారు. దీనితో రోగ నిరోధక శక్తి పెరిగి మెదడు అభివృద్ధి చెందుతుంది. చిన్నపిల్లలను ఇంట్లో బయట ఆడుకునేందుకు వీలు కల్పించాలన్నారు. శారీరక నైపుణ్యాలు మెరుగవుతున్నాయి. ఎక్కువ సమయం చిన్న పిల్లలతో గడపాలని ఇందువల్ల వారి అభివృద్ధికి దోహదపడుతుంది. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు రామలక్ష్మి వరలక్ష్మి మేరీ సుజాత ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు, అంగన్వాడి కేంద్రాల పరిధిలోని గర్భవతులు, పిల్లల తల్లిదండ్రులు మరియు బాలింతలు పాల్గొనడం జరి గింది

# బ్రహ్మ రథం ను - పరిసర ప్రాంతాలను పరిశీలించిన.... మఠాధిపతులు శ్రీ శ్రీ శ్రీ వీరధర్మజ వెంకటాద్రి స్వామి...





బ్రహ్మంగారిమఠం ఏప్రిల్ 10: హైదరాబాద్ ఎస్టేట్
శ్రీమద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి వారి మఠం మఠాధిపతులు శ్రీ శ్రీ శ్రీ వీర ధర్మజ వేంకటాద్రి స్వాములవారు ఈనెల 23వ తేదీ నుండి 28వ తేదీ వరకు జరగబోయే శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వారి ఆరాధన గురుపూజ మహోత్సవాల సందర్భంగా శుక్రవారం శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వారి మఠం పరిసర ప్రాంతాలన్నీ కూడా పరిశుభ్రంగా ఉంచాలని అలాగే మాడవీధులన్నిటిని కూడా శుభ్రంగా ఉంచాలని , షాపుల వారికి మరియు మఠం సిబ్బందిని ఆదేశించడం జరిగినది. అలాగే శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వారి రథాన్ని కూడా పరిశీలించి రథంకు సంబంధించిన మరమ్మతులను పూర్తిచేయాలని ప్రదర్శింపులకు ఆదేశాలు జారీ చేశారు. అలాగే 2 సెక్టర్ లను మరమ్మతులు చేయించవలసిందిగా సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. రథం పరిసర ప్రాంతాలన్నీ కూడా ఎప్పుడు పరిశుభ్రంగా ఉంచే విధంగా సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.

# మహిళల పట్ల అసభ్యత తగదు -జనసేన లక్ష్మయ్య



పోరుమామిళ్ల, ఏప్రిల్ 10(హైదరాబాద్ ఎస్టేట్ వైఎస్సార్సీపీ కుటుంబాలకు చెందిన మహిళలను కించపరచే విధంగా ఏబిఎన్ రాధాకృష్ణ చేసిన వ్యాఖ్యలపై రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో... పోరుమామిళ్ల జనసేన మండల అధ్యక్షుడు శీలంశెట్టి లక్ష్మయ్య ఘాటుగా స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాజకీయాల్లో విమర్శలు అనేవి కేవలం ప్రజా సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలపైనే ఉండాలి తప్ప, ఇంట్లోని మహిళలను రాజకీయంలోకి లాగి వారిని కించపరచడం అత్యంత దారుణమని పేర్కొన్నారు. విలేకరులైనా, రాజకీయ నాయకులైనా ఏ పార్టీకి సంబంధించిన వారైనా సరే, సమాజంలో స్త్రీలకు ఇచ్చే గౌరవానికి భంగం కలగకుండా మాట్లాడటం కనీస ధర్మమని ఆయన గుర్తు చేశారు.
స్త్రీ అంటే ఒక శక్తి అని, ప్రతి ఇంట్లో వెలుగు నింపే తల్లి, చెల్లి, భార్య రూపంలో ఉన్న ఆడబిడ్డలను గౌరవించడం మన భారతీయ సంస్కృతిలో భాగమని లక్ష్మయ్య అన్నారు. రాజకీయ లబ్ధి కోసం, వ్యక్తిగత కక్షల కోసం మహిళల పట్ల అసభ్యకరంగా మాట్లాడటం, వారిని అవమానపరిచే విధంగా ప్రవర్తించడం సరైన పద్ధతి కాదని, అలాంటి ధోరణిని సమాజంలో ఎవరూ అంగీకరించరని ఆయన అన్నారు. నాయకులు తమ మేధస్సును అభివృద్ధి పనుల కోసం, ప్రజా సంక్షేమానికి కొత్త దారులు వెతకడానికి ఉపయోగించాలే తప్ప, ఎదుటివారి కుటుంబ సభ్యుల వ్యక్తిత్వ హననం చేయడానికి కాదని హితవు పలికారు. స్త్రీలను గౌరవించిన చోటే అభివృద్ధి ఉంటుందని, ఇకనైనా మహిళల పట్ల మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని లక్షుమయ్య అన్నారు

# పందులను అరికట్టడంలో అధికారుల నిర్లక్ష్యం....

### సిపిఎం మండల కార్యదర్శి గండి సునీల్ కుమార్ డిమాండ్...




బ్రహ్మంగారిమఠం ఏప్రిల్ 10 : హైదరాబాద్ ఎస్టేట్
బ్రహ్మంగారిమఠంలో పందులను అరికట్టడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని సిపిఎం మండల కార్యదర్శి గండి సునీల్ కుమార్ తెలిపారు. శుక్రవారం ఉదయం వారు స్థానిక సిపిఎం కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూబ్రహ్మంగారి మఠం మండల కేంద్రంలో పందుల బెడద తీవ్రంగా ఉందని నిత్యం భక్తులకు అసౌకర్యం కలుగుతుందని అనేక సార్లు అధికారులకు పిర్యాదు చేసిన అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. దీని కారణంగా శుక్రవారం ఉదయం స్థానిక బాలికల హైస్కూల్ లో పందులు విద్యార్థులపై దాడి చేయడం జరిగిందని వారు తెలిపారు.



సమయానికి ఉపాధ్యాయులు స్పందిండం వల్ల పెద్ద ప్రమాదమే తప్పిందని వారు అన్నారు. పందులను అరికట్టాలని బయటకు తరలించాలని పలుమార్లు అధికారులకు తెలిపిన, ఆందోళన చేసినప్పటికీ పందులను బయటకు తరలించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని వారు తెలిపారు. పందుల యజమానులతో అధికారులు కుమ్మక్కై విచ్చలవిడిగా ఎక్కడపడితే అక్కడ పందులను వదలడం వల్ల భక్తులకు, ప్రజలకు, విద్యార్థులకు సమస్యగా ఉందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పందులన్నింటినీ అరికట్టి బయటకు తరలించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి సానా గోవిందు, హరి సిపిఎం కార్యకర్తలు పాల్గొన్నారు.



# కీర్తన అనే విద్యార్థి మృతికి కారణమైన వారిని కఠినమైన చర్యలు తీసుకోవాలి.

ప్రొద్దుటూరు హైదరాబాద్ ఎస్టేట్
ఖాజీపేట టౌన్ అగ్రహారం లో కీర్తన అనే విద్యార్థిని గొంతు కోసి చంపిన వెంకటేష్ నిందితుని కఠినంగా శిక్షించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి ముంతాజ్ స్థానిక ప్రొద్దుటూరు ఐద్వా కార్యాలయంలో పత్రిక విలేకరులతో మాట్లాడుతూ.. ఖాజీపేట టౌన్ అగ్రహారం లో కీర్తన అనే విద్యార్థిని గొంతు కోసి చంపిన వెంకటేష్ నిందితుని కఠినంగా శిక్షించాలని రాష్ట్రంలో హోంమంత్రి మహిళా అయి ఉండి కూడా మహిళల మీద విద్యార్థుల మీద దాడులు ఈ మధ్యకాలంలో చాలా ఎక్కువ అయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం మహిళల మీద విద్యార్థుల మీద దాడులు అరికట్టడంలో విఫలమైంది అని అన్నారు. గతంలో గండికోటలో కూడా ఒక ఇంటర్ విద్యార్థిని చంపిన కూడా ఇంతవరకు నిందితుని కనిపెట్టలేదని అని అన్నారు. మహిళా చట్టాలు పేపర్లో పేరుకే ఉన్నాయి తప్ప అమలులో లేవు అని అన్నారు. ఇప్పటికైనా మహిళల మీద విద్యార్థుల మీద జరుగుతున్న దాడులు ఆపాలి లేని పక్షంలో రాష్ట్ర ప్రభుత్వం మీద మహిళతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని ఐద్వా మహిళా సంఘం గా ప్రభుత్వాన్ని హెచ్చరించారు

# రాష్ట్రస్థాయి 8వ పోషణ పక్వాడ కార్యక్రమం

### ఘనంగా 8 వ పోషణ్ పక్వాడ అవగాహన కార్యక్రమం.!!ఐసిడిఎస్ సూపర్వైజర్ లక్ష్మీదేవి

జమ్మలమడుగు హైదరాబాద్ ఎస్టేట్ - జమ్మలమడుగు ఐసిడిఎస్ ప్రాజెక్టు మున్సిపల్ పరిధిలోని జమ్మలమడుగు-4 అంగన్వాడి కేంద్రం నందు రాష్ట్ర స్థాయి 8 వ పోషణ పక్వాడ ప్రారంభ కార్యక్రమం నిర్వహించారు. గర్భవతులు, బాలింతలకు 0 నుండి 2 సంవత్సరాల పిల్లల తల్లులకు జింక్ ఫుడ్ గురించి మితిమీరిన ఉప్పు మరియు నూనె వాడకం వలన నష్టాల గురించి తెలియజేస్తూ ప్రతి బిడ్డకు 0 నుండి 2 సంవత్సరాల లోపు 1000 రోజుల సంరక్షణ కీలకమైనది మరియు 80% మెదడు అభివృద్ధి ఈ వయసులోపే అభివృద్ధి జరుగుతుందని, అలాగే మొబైల్ చూపించడం వలన కలిగే నష్టాల గురించి గర్భవతులు, బాలింతలు ఎలాంటి పోషకాహారం తీసుకోవడం ద్వారా బిడ్డ యొక్క శారీరక, మానసిక భాషాభివృద్ధి, ఎదుగుదల మరియు పోషకాహార లోపం వల్ల కలిగే దుష్ఫలితాలు గురించి అవగాహన కల్పించడమైనది. ఈ కార్యక్రమంలో సిడిపిఓ, జి ఎం ఎస్ కె రేఖ, అంగన్వాడి కార్యకర్తలు ఎస్. ముంతాజ్ బేగం, ఎస్. గంగాదేవి మరియు పిల్లల తల్లులు పాల్గొన్నారు



# మంటలు చెలరేగి మూడు బస్సులు దగ్ధం





కమలాపురం హైదరాబాద్ ఎస్టేట్ ఏప్రిల్ 10: కమలాపురం మండల పరిధిలోని కోగటం గ్రామంలో ఊరి బయట నైట్ హాల్ట్ కొరకు పెట్టుకున్న వివిధ స్కూల్ మరియు కాలేజ్ లకు చెందిన 3 బస్ లు నిన్న అర్ధరాత్రి సుమారు 12.30 గంటల సమయంలో మంటలు చెలరేగి కాలిపోవడం జరిగింది. వెంటనే కమలాపురం పోలీస్ వారు మరియు ఫైర్ స్టేషన్ సిబ్బంది వెళ్లి మంటలను అదుపులోకి తీసుకురావడం జరిగింది. ఈ ఘటనలో(1). గీతాంజలి హై స్కూల్, బొల్లవరం ఆంజనేయ స్వామి విగ్రహం ప్రక్కన, ప్రొద్దుటూరు. బస్ నెంబర్: ఏపి03 టిజె 0290. ఓనర్: సైగిల శివ రామి రెడ్డి, ప్రొద్దుటూరు. డ్రైవర్: సూరి, శ్రీనివాస నగర్, ప్రొద్దుటూరు అను అతను సుమారు 1 సం,, నుండి స్కూల్ బస్ డ్రైవర్ గా పని చేస్తూ ఉన్నాడు. (2). ఐడెల్ పబ్లిక్ స్కూల్, ప్రొద్దుటూరు. కొత్త బస్, గోపికృష్ణ మాంటెస్సోరి హై స్కూల్, నేతాజీ నగర్ రోడ్ నెంబర్ 1, ప్రొద్దుటూరు. బస్ నెంబర్: ఏపీ04యుబి 0532. ఓనర్: షేక్ పీర్ల మహమ్మద్, మిట్టమడి వీధి, ప్రొద్దుటూరు. డ్రైవర్: అయ్యప్పస్వామి టెంపుల్, ప్రొద్దుటూరు అను అతను సుమారు 6 సం,, ల నుండి స్కూల్ బస్ డ్రైవర్ గా పని చేస్తున్నాడు. పైన తెలిపిన 3 బస్ లు పూర్తిగా కాలిపోవడం జరిగింది.

# నేతాజీ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ఘనంగా 8వ వార్షికోత్సవం వేడుకలు..

బద్వేలు, హైదరాబాద్ ఎస్టేట్
నేతాజీ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్లో శుక్రవారం 8వ వార్షికోత్సవ వేడుకలు అట్టహాసంగా జరిగాయని ప్రిన్సిపాల్ అనుమల విజయలక్ష్మి తెలియజేశారు . ఈ సందర్భంగా ప్రీ-ప్రైమరీ మరియు ప్రైమరీ విభాగాల చిన్నారులకు జశీఅజశీఎ్ఓఅశీఅ ఋఎ నిర్వహించి వారికి ప్రత్యేక గుర్తింపు అందించారు.ఈకార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, నాటికలు వంటి కల్చరల్ ఆక్టివిటీస్ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. పాఠశాల వార్షికోత్సవం విద్యార్థుల ప్రతిభను, శ్రమను, సాధనలను ప్రదర్శించే ముఖ్యమైన వేదికగా నిలిచింది. ఈకార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



# టిడిపి కార్యకర్తలతో ముఖాముఖి



జమ్మలమడుగు హైదరాబాద్ ఎస్టేట్
జమ్మలమడుగు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మైలవరం, పెద్దముడియం, జమ్మలమడుగు మండలాల తెలుగుదేశం పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించిన కడప జిల్లా తెలుగుదేశం పార్టీ అధినేత చదిపిరాళ్ళ భూపేష్ సుబ్బరామిరెడ్డి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు పార్టీ నిర్మాణం బలోపితం చేయడానికి మరియు రాబోయే స్థానిక సంస్థల ఎలక్షన్లలో స్థానిక సమస్యలపై చర్చించి ప్రజలలోకి ఎలా వెళ్లాలి కష్టపడిన ప్రతి ఒక్క కార్యకర్తకు పార్టీ అండదండలు ఉంటాయని నాయకులకు, కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి , మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ మల్లికార్జున, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్చార్జిలు, నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

RNI No Tel / 2012 /4241
హైద్రాబాద్ ఎస్టేట్
తెలుగు దిన పత్రిక
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
hyderabadestate.co.in
శనివారం 11
ఏప్రిల్ 2026

# బుచ్చయ్యపేట పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ:

# శాంతిభద్రతల పరిరక్షణలో రాజీ పడొద్దు

### -- జిల్లా ఎస్పీ శ్రీ తుహిన్ సిన్హా ఐపీఎస్

**అనకాపల్లి**

అనకాపల్లి జిల్లా ఎస్పీ శ్రీ తుహిన్ సిన్హా ఐపీఎస్ గారు ఈరోజు బుచ్చయ్యపేట పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించి, స్టేషన్ పనితీరును మరియు కేసుల ప్రగతిని క్షుణ్ణంగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ గారికి అనకాపల్లి సబ్ డివిజన్ డీఎస్పీ శ్రీమతి ఎం.శ్రావణి, కొత్తకోట సీఐ జి.కోటేశ్వరరావు, మరియు ఎస్సై ఏ.శ్రీనివాసరావు సాదర స్వాగతం పలికారు.

తనిఖీలో భాగంగా ఎస్పీ గారు మాట్లాడుతూ...

ఆస్తి దొంగతనాలు జరగకుండా పక్కా ప్రణాళికతో ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎస్పీ గారు ఆదేశించారు. ముఖ్యంగా రాత్రి మరియు పగలు సమయాల్లో బీట్లను మరింత పటిష్టం చేయాలని, నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలని సూచించారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. రౌడీ షీటర్లను ప్రతి వారం పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరికలు జారీ చేయాలన్నారు.సమాజంలో చైతన్యం తేవడానికి రోడ్డు భద్రత, సైబర్ క్రైమ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు, మహిళలకు మరియు బాలబాలికలకు వారి రక్షణకు సంబంధించిన చట్టాలపై నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.పోలీసు అధికారులు తరచుగా గ్రామాలను సందర్శించాలని, గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. వారు అందించే సమాచారంపై తక్షణమే స్పందించి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని, సీసీటీవీ కెమెరాల ఏర్పాటుపై గ్రామస్థులను ప్రోత్సహించాలని, స్టేషన్‌లో పెండింగ్‌లో ఉన్న కేసులను, సీజ్ చేసిన వాహనాలను త్వరితగతిన పరిష్కరించాలని



అధికారులకు సూచించారు.అనంతరం స్టేషన్ సిబ్బందితో సమావేశమైన ఎస్పీ గారు, విధుల్లో క్రమశిక్షణ, నిబద్ధత కలిగి ఉండాలని పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజాసేవయే పరమావధిగా పనిచేయాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఈ తనిఖీ కార్యక్రమంలో ఎస్సై ఏ.శ్రీనివాసరావు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయం, అనకాపల్లి

# ఇక ఆ భూములు మీ సొంతం

## -, చంద్రబాబు కీలక ప్రకటన..!!



ఏపీ అమరావతిహైదరాబాద్ ఎస్టేట్

ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక ప్రకటన చేసారు. 2016 కంటే ముందు ప్రభుత్వ హౌసింగ్ స్కీంలో పట్టా పొందిన ప్రతీ ఇంటికి రిజిస్ట్రేషన్ చేయించుకునే సౌలభ్యం కల్పిస్తున్నామని వెల్లడించారు. లబ్దిదారులు క్రయవిక్రయాలకు, గిఫ్ట్ డీడ్లకు అవకాశం కల్పిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నాట్లు స్పష్టం చేసారు. రాష్ట్ర వ్యాప్తంగా 75 లక్షల మంది పేద కుటుంబాలకు ఈ నిర్ణయం ద్వారా లబ్ది కలుగుతుందని వెల్లడించారు. అదే విధంగా రాష్ట్రంలో ఫ్రీ హోల్డ్ కింద అర్హత కలిగిన 9.25 లక్షల ఎకరాలపై భూ యజమానులకు యాజమాన్య హక్కులు కల్పిస్తున్న ట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. భూమి అనేది కేవలం ఆస్తి మాత్రమే కాదని అది జీవనాధారమని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గంలోని సూరేపల్లిలో 'మీ భూమి–మీ హక్కు' కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొని భూసమస్యల పరిష్కారంలో భాగంగా తీసుకుంటున్న నిర్ణయా లను వెల్లడించారు. సచివాలయంలోనే భూమి రికార్డులకు సంబంధించిన వివరాలను సరిచేసు కునే అవకాశాన్ని కూడా స్వర్ణవార్డు, స్వర్ణ గ్రామ కార్యాలయాల్లో చేసుకోవచ్చని చెప్పుకొచ్చారు. అదే విధంగా గ్రామాలతో పాటు పట్టణాల్లోనూ ఆటోమ్యుటేషన్ ప్రక్రియ ద్వారా మేలు జరిగేలా చూస్తున్నామని వివరించారు. రైతులు ఇక ఎమ్మార్వో కార్యాలయాలకు రావాల్సిన అవసరం లేకుండా ఆస్తులు బదిలీ కాగానే ఇంటికే పట్టాదారు పాస్ పుస్తకం వచ్చేలా చూస్తామని ప్రకటించారు. కాగా, ఇక.. రిజిస్ట్రేషన్ ప్రక్రియలోనూ సంస్కరణల్ని తీసుకు రావాలని ఆలోచన చేస్తున్నట్లు తెలిపారు. ఆటోమేటిక్ రిజిస్ట్రేషన్ జరిగేలా కార్యాచరణ చేపట్టాలని నిర్ణయించామని చెప్పారు. పట్టాదారు పాసు పుస్తకాలు రాజముద్రతో అందిస్తాం

రూ.10 లక్షల లోపు ఉన్న వారసత్వ భూములు రూ.100, అంతకంటే ఎక్కువ విలువ ఉన్న వారసత్వ భూములు రూ.1 వెయ్యితో రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చని చెప్పుకొచ్చారు. జాయింట్ ఎల్పీల విషయంలో వివాదాలు తెచ్చుకోవద్దని ప్రజలందరికీ విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపారు. 1.12 కోట్ల పట్టాదారు పాస్ పుస్తకాలు ఇచ్చే బాధ్యత తీసుకుంటానన్నారు. 16,816 గ్రామాలు రీ సర్వే చేయాలన్నారు. ఇప్పటికే 21.23 లక్షల కొత్త పాస్ పుస్తకాలు ప్రజలకు ఇచ్చామని తెలిపారు. జూలై నాటికి 9 లక్షల పాస్ పుస్తకాలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఇంకా 80 లక్షల పాస్ పుస్తకాలు ఇవ్వాలని చంద్రబాబు వివరించారు. కరెన్సీకి వాడే సాంకేతికతే పట్టాదారు పాస్ పుస్తకాలకు వాడామన్నారు. మీ ముందు సర్వే చేయించి రికార్డు చేస్తామని.. ఈకేవైసీ చేశాకే పట్టాదారు పాస్ పుస్తకం ఇస్తామని వెల్లడించారు. భూ యజమాని సమక్షంలో మొత్తం ప్రక్రియ నిర్వహిస్తున్నామని... రూపాయి కూడా అవినీతి లేకుండా పాస్ పుస్తకాలు ఇవ్వాలనేది తన లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేసారు.

# గ్రామాభివృద్ధి, పార్టీ బలోపేతమే ప్రతి తెలుగుదేశం పార్టీ నాయకుడి, కార్యకర్త లక్ష్యం

## :- శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి

**పాములపాడు** :వెలుగోడు మండలంలోని, వేల్పనూరు గ్రామంలో జరిగిన కార్యక్రమంలో గ్రామాల అభివృద్ధి, తెలుగుదేశం పార్టీ బలోపేతం, కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమఅభివృద్ధి పథకాలను ప్రతి ఇంటికీ చేరవేయడం ప్రతి కార్యకర్త బాధ్యత అని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి పేర్కొన్నారు.





ఈమేరకు శుక్రవారం వేల్పనూరు నందు వివిధ శాఖల అధికారులు మరియు పార్టీ శ్రేణులతో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ అధికారులు, కూటమి నాయకత్వం సమిష్టిగా సంక్షేమం, అభివృద్ధి పనులను వేగవంతం చెయ్యాలని సూచించారు. గ్రామస్థాయి నుండి మండల స్థాయి వరకు పార్టీ నాయకులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో 100 శాతం కూటమి అభ్యర్థులు గెలుపొందేలా కృషి చేయాలని సూచించారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు.గ్రామాల్లో ఉన్న సమస్యలను గుర్తించి అధికారులతో చర్చించి తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకునేలా కార్యాచరణ రూపకల్పన చేయాలని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం పార్టీ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, గ్రామ స్థాయి ఎన్నికల వ్యూహాలపై నాయకులు, కార్యకర్తలకు ఆయన దిశానిర్దేశం చేశారు



# జనగణన సర్వే పారదర్శకంగా చేపట్టాలి

రుద్రవరం, మండలంలోని ఆయా గ్రామాలలో త్వరలో చేపట్టనున్న జనగణన సర్వే పారదర్శకంగా చేపట్టాలని డిప్యూటీ తహశీల్దార్ చంద్రశేఖరయ్య సిబ్బందికి సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో జనగణనపై మొదటి విడత టీంకు రెండో రోజు శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. జనగణనపై చేపట్టాల్సిన విధి విధానాలపై ట్రైనర్లు సిబ్బందికి వివరించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో వీఆర్వోలు, గ్రామ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్య పరంగా అందిస్తున్న సేవలు విషయంలో ప్రజల్లో విశ్వసనీయత పెరగాలి

## చింతలపూడి శాసనసభ్యులు సొంగ రోషన్ కుమార్

ఏలూరు

ఏలూరు జిల్లా చింతలపూడి క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గంలోని జంగారెడ్డిగూడెం , చింతలపూడి ఏరియా ఆసుపత్రుల సూపరింటెండెంట్లు, వైద్యులతో నిర్వహించారుప్రభుత్వం వైద్యా రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని తదనుగుణంగా వైద్యులు కూడా ప్రజలు తృప్తి పొందే స్థాయిలో వైద్య సేవలు అందించాలని రోషన్ కుమార్ కోరారు. ఆసుపత్రి ప్రాంగణాల్లో ప్రైవేటు ఆసుపత్రిలో వలె పారిశుద్ధ్యం మెరుగుపరచాలన్నారుప్రభుత్వం ప్రజలకు ఉచితంగా అందించే ల్యాబ్ పరీక్షలు గురించి విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని రోషన్ కుమార్ పేర్కొన్నారువైద్యులు ప్రజారోగ్య పరిరక్షణ విషయంలో ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని ఆ దిశగా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే రోషన్ కుమార్ ఆదేశించారు




# హెచ్ పి వి వ్యాక్సిన్‌తో గర్భాశయం క్యాన్సర్‌కు చెక్

## -చింతలపూడి ఎమ్మెల్యే రోషన్ కుమార్



ఏలూరు జిల్లా ప్రతినిధి క్యాన్సర్ నిర్మూలనకు 9- 14 సంవత్సరాల బాలికలకు హెచ్ పి వి వ్యాక్సినేషన్ చేయించు కోవాలి హెల్తీ వుమెన్.హెల్తీ స్టేట్.అని పిలుపు ఇచ్చిన ఎమ్మెల్యేరోషన్ కుమార్ లింగపాలెం మండలం ధర్మాజీగూడెం గ్రామం లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెచ్ పి వి వ్యాక్సినేషన్ కార్యక్రమంలో పాల్గొన్న చింతలపూడి శాసన సభ్యులు శ్రీ సొంగా రోషన్ కుమార్ ఈ సందర్భంగా ఎమ్మెల్యేరోషన్ కుమార్ మాట్లాడుతూ తల్లిదండ్రులు అవగాహనతో తమ ఆడ పిల్లలకు హెచ్ పి వి వ్యాక్సినేషన్ చేయించు కోవాలన్నారుసమాజంలో క్యాన్సర్ గురయ్యే మహిళల్లో 50% పైగా సెర్వికల్ క్యాన్సర్ తో బాధ పెడుతున్నారని ప్రభుత్వం గుర్తించి ఉచితంగా వేలాది రూపాయలు ఖరీదు గల వ్యాక్సిన్ కేంద్ర ప్రభుత్వం సహకారంతో రాష్ట్రం లో పంపిణీ చేస్తున్న మన్నారు. వైద్య సిబ్బంది ప్రజల్లో అవగాహన కల్పించి వాక్సినేషన్ చేయాలని సూచించారు. ఈ సందర్భంగా వాక్సినేషన్ చేయించు కున్న బాలికలకు వాక్సినేషన్ సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.కార్యక్రమంలో వైద్యులతో పాటు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి - శాసనసభ్యులు రోషన్ కుమార్

ఏలూరు ): ఏలూరు జిల్లా చింతలపూడిలో

వెనుకబడిన తరగతుల అభ్యున్నతికి తెలుగుదేశం ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే రోషన్ కుమార్ పేర్కొన్నారు శుక్రవారం క్యాంప్ కార్యాలయంలో తెలుగుదేశం బీసీ సంఘాల కార్యకర్తలతో సమావేశం అయ్యారుబీసీలను ఆదరించింది తెలుగుదేశం ప్రభుత్వం అని , రాజకీయంగా అత్యధిక ప్రాధాన్యత తమ ప్రభుత్వం ఇస్తుందన్నారుప్రభుత్వం బీసీలకు అందిస్తున్న చేయూత, ప్రాధాన్యతలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన దిశ నిర్దేశం చేశారు.




# 10వ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి సిఐటియు

## జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ పిలుపు

కడప హైదరాబాద్ ఎస్టేట్



సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ సిఐటియు ఏప్రిల్ 11న పాత రిమ్స్ నందు జరుగు పదోవ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మనోహర్ శ్రీనివాస ల రెడ్డి ,జిల్లా కోశాధికారి లక్ష్మీదేవిలు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు .ముఖ్యంగా ఈ మహాసభలకు ముఖ్యఅతిథిగా సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సిహెచ్ నర్సింగరావు గారు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు గారు ,హాజరవుతున్నట్లు తెలిపారు. గత మూడు సంవత్సరాల కాలంలో జరిగినటువంటి కార్యక్రమాల పైన చర్చించి భవిష్యత్తులో కార్మిక వర్గంపై జరుగుతున్నటువంటి దాడిని ఎలా ఎదుర్కోవాలని అంశాల పైన చర్చించి భవిష్యత్తు ప్రణాళిక రూపొందించడం జరుగుతుందన్నారు . కనుక జిల్లాలో ఉన్నటువంటి ప్రతినిధి వర్గం ఉదయం 9 గంటలకల్లా కచ్చితంగా చేరుకొని మహాసభలను జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు.

# పోషణ పక్కవాడ కార్యక్రమంలో గర్భిణులు, తల్లులకు అవగాహన

**రౌతులపూడి**

ములగపూడి, రామకృష్ణాపురం గ్రామాల్లో 8వ పోషణ పక్కవాడ కార్యక్రమం ఏప్రిల్ 9 నుంచి 23 వరకు జరుగుతోంది. ఈ భాగంగా ఈరోజు ఈ రెండు గ్రామాల్లో గర్భిణులు, మూడు సంవత్సరాల లోపు పిల్లల తల్లులకు సమావేశాలు నిర్వహించారు.సిడిపివో పర్వత వెంకటలక్ష్మి తల్లులను ఉద్దేశించి మాట్లాడుతూ, పిల్లలను ఫోన్లు, టీవీ స్క్రీన్లకు దూరంగా ఉంచాలని, బయట ఆటలకు ప్రోత్సహించాలని సూచించారు. "85% మెదడు అభివృద్ధి రెండు సంవత్సరాల్లోపే జరుగుతుంది. ఈ వయసులో పిల్లలు పరిసరాలు, చుట్టూ ఉన్న వ్యక్తులు, తాతయ్య–నానమ్మల కథల ద్వారా చాలా విషయాలు నేర్చుకోగలరు. అలాంటి అవకాశాలు కల్పించాలి" అని చెప్పారు.అదే సమయంలో, పిల్లలకు జంక్ ఫుడ్ ఇవ్వకూడదని, ఇంటి తయారీ ఆహారాలకు ప్రాధాన్యత ఇవ్వాలని, నూనె–చక్కెర–ఉప్పు వాడకం తగ్గించాలని, ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని తల్లులకు అవగాహన కల్పించారు.హెల్త్ సిబ్బంది గర్భిణులకు పోషకాహారం, జాగ్రత్తలు, తల్లిపాల ప్రాధాన్యతల గురించి వివరించారు. కార్యక్రమంలో హెల్త్ సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



హైద్రాబాద్ ఎస్టేట్
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in



# యువతే మన దేశానికి శక్తి

## వైబ్రంట్స్ ఆఫ్ కలాం అధ్యక్షులు విజయ్ కలాం

కావలి,

మాదక ద్రవ్యాలు మానవ శరీరానికి మిక్కిలి హాని కలిగించేవని,మాదక ద్రవ్యాల వాడకం ఒక ప్రమాదమైన వ్యసనమని వైబ్రంట్స్ ఆఫ్ కలాం వ్యవస్థాపక అధ్యక్షులు విజయ్ కలాం అన్నారు.దండి మార్చి 2.0 డ్రగ్ ఫ్రీ ఆంధ్రప్రదేశ్ సైకిల్ యాత్ర 5 వ రోజు కావలి నియోజకవర్గం కడనూతల ఆర్ ఎస్ ఆర్ ఇంజనీరింగ్ కళాశాల వరకు సాగింది. ఆర్ఎస్సార్ కళాశాల కాన్ఫరెన్స్ హాల్లో ఇంజనీరింగ్ విద్యార్థులకు మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వైబ్రంట్స్ ఆఫ్ కలాం వ్యవస్థాపక అధ్యక్షులు విజయ్ కలాం మాట్లాడుతూ ఈ నెల ఆరోవ తేదీ నుండి తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ క్యాంపస్ ప్రారంభం అయిన సైకిల్ యాత్ర ఐదోవా రోజు కావలి 200 ఎవె చేరుకుందని తిరుపతి నుండి వైజాగ్ వరకు 13 జిల్లాల మీదుగా 1000కి.మీ 17 రోజుల పాటు సైకిల్ యాత్ర జరుగుతుందని ఆయన అన్నారు.ఈగల టీం సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ రాజీవ్ కుమార్ మాట్లాడుతూ మాదకద్రవ్యాలను అరికట్టటకు ప్రతి ఒక్కరూ సహకరించాలని,మాదక ద్రవ్యాలలో వివిధ రకాలున్నాయని నల్లమందు, మార్ఫిన్, హెరాయిన్, చరస్, గంజాయి, మారిజువానా, కొకైన్, ఎల్.ఎస్.డి. మొదలైనవిగా మనం వింటున్నాం,అది అరికట్టాల్సిన బాధ్యత మనందరిపై ఉందని దీనికి టోల్ ఫ్రీ నెంబర్ 1972 కాల్ చెయ్యాలని ఆయన అన్నారు.ఆర్ఎస్ ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ సివియన్ రెడ్డి మాట్లాడుతూ ఈనాటి యువతరాన్ని దారి మళ్ళించి చెడు మార్గాల్లో నడిపిస్తున్న దురలవాట్లలో మాదక ద్రవ్యాల వినియోగం తీవ్రమైనదని ఆయన అన్నారు. అనంతరం కళాశాల ఆవరణంలో 100 అడుగుల జాతీయ జెండాను ప్రదర్శన చేశారు,ఈ సైకిల్ యాత్ర లో విజయ్ కలాం (ఫౌండర్) భాస్కర్ ,ఓరగంటి రంజిత్,రవి రేపాకుల,శ్రీను తోళ్ల, జహీర్ పాషా,ఫయాజ్ చేస్తున్న 7 టీం సభ్యులు వైబ్రంట్స్ ఆఫ్ కలాం రాష్ట్ర కో ఆర్డినేటర్ రవి రాజు, జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ చేవూరు చిన్న, ఈగల్ సెల్ నెల్లూరు టీమ్ ఫిరోజ్,సుభాని పాల్గొన్నారు.

